క్లుప్తంగా

బ్రిడ్జికి మరమ్మతులు

గుండాల: గుంతలమయంతో ఉన్న లో లెవెల్ బ్రిడ్జిపై అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. మండలంలోని కొడవటంచ సమీపంలో కిన్నెరసానిపై గతంలో నిర్మించిన లోలెవల్ బ్రిడ్జిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన అధికారులు గుంతలపై కాంక్రీట్‌తో మరమ్మతులు చేశారు. ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ శ్యాంసుందర్ రెడ్డిలకు ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సదుపాయాలు కల్పించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని యోగా షెడ్డులో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు అన్నారు. శనివారం ఏరియా ఆస్పత్రి వైద్యులతో సమావేశం ఏర్పాటు చేసిన ఆయన.. ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసావాల సంఖ్య పెంచేలా యోగా ట్రైనింగ్ సెంటర్‌లో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను ఆదేశించారు.

ఇంటింటా జ్వర సర్వే

పినపాక: పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు మధు ఆధ్వర్యంలో శనివారం భూపాలపట్నం పంచాయతీలో తన సిబ్బందితో కలిసి జ్వర సర్వే నిర్వహించారు. గృహాలను సందర్శించారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వీరాస్వామి, హెచ్ఈఓ హనుమంతు, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, ఎంటీఎస్ అరుణ్ బాబు, ఏఎన్ఎం పార్వతి, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావద్దు

అశ్వాపురం: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఏఎస్సై రామచంద్రా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అశ్వాపురం జెడ్పీ స్కూల్, గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో శనివారం అశ్వాపురం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, ర్యాగింగ్, గంజాయి, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

దమ్మపేట: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఆచూకీ లేకపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. దమ్మపేట మార్కెట్‌యార్డ్ వీధిలో తల్లిబోయిన రాము(36), స్వాతి దంపతులు నివసిస్తున్నారు. ఇంటి స్థలం విక్రయించగా వచ్చిన డబ్బుతో రాము మూడు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఆచూకీ లేకపోవడంతో స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఐఎన్‌టీయూసీ నేత మృతి

మణుగూరుటౌన్: ఐఎన్‌టీయూసీ నాయకుడు నామా వెంకటేశ్వరరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. కాగా నామా వెంకటేశ్వరరావు ఏఐటీయూసీ యూనియన్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించి, కొంతకాలంగా ఐఎన్‌టీయూసీలో క్రియాశీలక నాయకులుగా ఉన్నారు. గత ఏడాది క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చికిత్సలు పొందగా.. ప్రస్తుతం ఉన్నపాటున స్పృహ కోల్పోయి మృతిచెందారు. ఆయన మృతి పట్ల సింగరేణి కార్మిక సంఘాల నాయకులు రాంగోపాల్, కృష్ణంరాజు, నాగెల్లి వెంకట్, వెంకటరత్నం, కాంగ్రెస్ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, నవీన్, దొబ్బల వెంకటప్పయ్య, గుడిపూడి కోటేశ్వరరావు, సీపీఐ, సీపీఎం నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సొంతగూటికి సొసైటీ డైరెక్టర్

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనుతూలా గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ పీసోడి వెంకటేష్ కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ జిల్లా నాయకులు రావూలపల్లి రాంప్రసాద్, నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు మానే రామకృష్ణ ఇతర నాయకుల సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్, కోకన్వీనర్ కణితి రాముడు, జానిపాషా, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ములకలపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విరివిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నిమ్మల మధు, బైరు ప్రసాద్, గోపగాని లక్ష్మీనర్సు, కృష్ణ, సారయ్య పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి..


ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాకమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్, మండల నాయకులు నకిరకంటి నాగేశ్వరరావు, యర్రగొర్ల రామారావు, బండారు నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

గణపయ్య ముస్తాబు

27 నుంచి నవరాత్రి ఉత్సవాలు
- విక్రయ కేంద్రాల వద్ద మొదలైన సందడి
- నిబంధనలు పాటించాలని అవగాహన కల్పిస్తున్న అధికారులు



భద్రాద్రి రామయ్యతో రథంపై గణేష్



నాగదేవత నీడలో గణపయ్య

భద్రాచలంటౌన్: గణపతి నవరాత్రోత్సవాలకు వేళ అవుతుండడంతో వాడవాడలా కొలువుదీరి భక్తులచే పూజలందుకునేందుకు తీరొక్క రూపాల్లో బొజ్జ గణపయ్య ముస్తాబవుతున్నాడు. ఈ నెల 27న వినాయక చవితికి ప్రతిష్ఠించేందుకు విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే డివిజన్‌లో భద్రాచలంతో పాటు పలు మండల కేంద్రాల్లో తయారీదారులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. అలాగే సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, ఆంధ్ర నుంచి ప్రజలు భద్రాచలం వచ్చి విగ్రహాలను భారీగా విక్రయిస్తుంటారు. వీరి వద్ద సైతం ఇప్పటికే అడ్వాన్స్‌లు, బుకింగ్‌లు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

భజనలు.. పూజలు

నవరాత్రుల్లో భాగంగా భక్తులు ఆలయాలు, ప్రధాన కూడళ్లతో పాటు ప్రతి కాలనీలో గణనాథులను ప్రతిష్ఠిస్తారు. నవరాత్రుల సమయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం 9, 11వ రోజుల్లో విగ్రహాలను సమీపంలోని నదులు, వాగు, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. కానీ ఈ ఏడాది 9 రోజులు మాత్రమే పూజలు నిర్వహించాలని పండితులు సూచిస్తున్నారు. కాగా, ఈ తొమ్మిది రోజులు ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల వద్ద భజనలు మారుమోగనున్నారు. వైభవంగా పూజా కార్యక్రమాలు కొనసాగనున్నారు.

ఎనిమిది నెలలుగా తయారీ

భద్రాచలం పట్టణంలోని బిడ్జి సెంటర్‌లో రాజస్తాన్‌కు చెందిన వారు, చర్ల రోడ్డులో స్థానిక కళాకారులు ఎనిమిది నెలలుగా గణనాథులను తయారు చేస్తున్నారు. విగ్రహాల తయారీకి సంబంధించిన ముడి సరుకులు, రంగులు వరంగల్, హైదరాబాద్ నుంచి కొనుగోలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ఏడాది భద్రాద్రి కేంద్రంగా తయారీ దుకాణాల్లో సుమారు వెయ్యి వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నట్లు విక్రయదారులు తెలుపుతున్నారు.

మండపాల వద్ద నిబంధనలు ఇవీ..

గణపతి నవరాత్రుల ఉత్సవాల కోసం వాడవాడలా నిర్వహకులు మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే వాటి ఏర్పాటు, నిమజ్జనం వరకు నిర్వహణ విషయంలో పోలీసులు కొన్ని నిబంధనలు, షరతులు విధించారు.

- వినాయక ఉత్సవ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం సంబంధిత పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తుకు పంచాయతీ రాజ్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల నుంచి తీసుకున్న పత్రాలను జతపరచాల్సి ఉంటుంది.
- మండపాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇరుకు వీధుల్లో, రద్దీ ప్రాంతాలు, మూలమలుపుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేయకూడదు. ఉత్సవాల సందర్భంగా ఊరేగింపులు నిర్వహించే క్రమంలో పోలీసుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి.
- మండపాల వద్ద పెద్దగా ధ్వనులు వచ్చేలా లౌడ్‌స్పీకర్లు, డీజేలు పెట్టి శబ్ద కాలుష్యానికి పాల్పడ కూడదు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకర్లను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు బంద్ చేయాలి.
- మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి.
- విగ్రహాల ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా ఎలాంటి నినాదాలు, ప్రసంగాలు, ప్రకటనలు చేయకూడదు.
- ఉత్సవ మండపాల వద్ద, విగ్రహాల ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చకూడదు.
- వినాయక మండపాల వద్ద అనుచిత ప్రదర్శనలు నిర్వహించకూడదు.. ఊరేగింపు సమయాల్లో కర్రలు, ఆయుధాలు ఉపయోగించకూడదు.

ధరలు పెంచక తప్పలేదు..

వినాయక విగ్రహాల తయారీకి వాడే ముడిసరుకుల ధరలు బాగా పెరిగిపోవడంతో ధరలు పెంచక తప్పలేదు. ఈ ఏడాది సుమారు 500 వందల వరకు విగ్రహాలను తయారు చేశాం. రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. అమ్మకాలు చూస్తుంటే లాభం రాకపోయినా పెట్టుబడి వస్తుందని నమ్మకం ఉంది.

– మనోజ్, వ్యాపారి

నాలుగేళ్లుగా ఇదే వృత్తి

రాజస్థాన్ వాళ్ల దగ్గర విగ్రహాల తయారీ నేర్చుకున్న. ఆపై గత నాలుగేళ్లుగా విగ్రహాలు చేసి విక్రయిస్తున్నాము. గతంలో కంటే ఈ ఏడాది కొత్త రకాల డిజైన్లతో విగ్రహాలను తయారు చేశాం. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంటే సంతోషంగా ఉంది. విగ్రహాల విక్రయాలు బాగానే జరుగుతున్నాయి.

– రాజా, జగదీష్ కాలనీ

జోరుగా అమ్మకాలు..

సండే స్పెషల్

మణుగూరురూరల్: ఆది దేవుడిగా కొలిచే వినాయకుడి నవరాత్రోత్సవాలకు భక్తులకు సిద్ధమవుతున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని గత రెండు నెలల క్రితమే గణపతి విగ్రహాల తయారీకి నిర్వాహకులు అన్నీ సిద్ధం చేసుకోగా.. ప్రస్తుతం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. పార్వతీదేవి పసుపుముద్దతో వినాయకుడికి జీవం పోస్తే.. రాజస్థాన్ కళాకారులు తమ చేతి నైపుణ్యంతో గత రెండు నెలలుగా వినాయక ప్రతిమలు అచ్చులుగా వేసి జీవకళ ఉట్టిపడేలా మలుస్తున్నారు. మండలంలోని గుట్టమల్లారం, సుందరయ్యనగర్ ఎస్‌బీఐ ప్రాంతాల్లో విక్రయశాలలను ఏర్పాటు చేసుకుని నిర్వాహకులు గణపతి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. అడుగు నుంచి సుమారు 12 అడుగుల వరకు వివిధ రూపాల్లో గణపతి విగ్రహాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. విగ్రహాల ధరలు రూ.1500 నుంచి సుమారు రూ.40వేల వరకు అడుగుల చొప్పున పలుకుతున్నాయి.

ఈ సారి దబిడిదిబిడే..

ఈ సారి మండల వ్యాప్తంగా వీధివీధినా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగే అవకాశం ఉంది. పెద్ద సంఖ్యలో గణనాథులు కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉత్సవాలకు రాజకీయ రంగు పులిమే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల్లో పోటీ చేయదలచుకునే వారు యువత, ప్రజల మద్దతు కూడగట్టుకుని ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణకు ముందుకు వచ్చే అవకాశం ఉంది. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో 21 వార్డులు ఉండగా.. వినాయకచవితి ఉత్సవాలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పోటీ చేయదలచిన అభ్యర్థులు విగ్రహాలను ఉచితంగా అందజేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయితే, గతంలో మట్టి వినాయక ప్రతిమలనే కొలువుదీర్చి ఉత్సవాలు జరుపగా.. ప్రస్తుతం పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను మరింత సందడిగా నిర్వహిస్తున్నారు.

అనుమతి తప్పనిసరి



వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే కమిటీ సభ్యులు మండపాల ఏర్పాటు, సౌండ్ సిస్టం వంటి వాటికోసం ముందుగానే పోలీసుల అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలి. సభ్యులు తమ పేర్లు, వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందజేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు ఇచ్చాం. గణేష్ ఉత్సవాలు మొదలుకొని నిమజ్జనం వరకు ప్రశాంత వాతావరణంలో జరగాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలందరూ సహకరించాలని కోరుతున్నాం.

– డీఎస్పీ రవీందర్‌రెడ్డి



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథుల విగ్రహాలు

‘వయ్యారిభామ’ను తరిమేయండి

అశ్వారావుపేటరూరల్: అనారోగ్య సమస్యలకు కారణమౌతున్న కలుపు మొక్క వయ్యారిభామ లేని ప్రాంతాలుగా గ్రామాలను మార్చుకోవాలని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. శనివారం కళాశాలలో వయ్యారిభామ అవగాహన వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా కళాశాల విద్యార్థులు కలుపు మొక్కలను తొలగించారు. అనంతరం వయ్యారిభామ కలుపు మొక్కల కారణంగా కలిగే అనారోగ్యం, శ్వాస కోస, చర్మ సంబంధిత వ్యాధులు, వాతావరణ, నేల కాలుష్యం, ఇతర నష్టాల గురించి విద్యార్థులకు డీన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రావణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీన్ డాక్టర్ హేమంత్ కుమార్

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, హిస్టరీ అధ్యాపక పోస్టులు ఒక్కొక్కటి భర్తీ చేయనుండగా.. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులు ఉండాలని, పీహెచ్‌డీ, నెట్/సెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 25, 26, 28వ తేదీల్లో సత్తుపల్లిలోని జేవీఆర్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకుంటే, 29న కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

ఏఓ పోస్టు భర్తీ ఎన్నడు?

అశ్వాపురం: మండలంలో ఆరు నెలలుగా ఏఓ పోస్టు భర్తీ చేయడం లేదు. ఏఓగా విధులు నిర్వహిస్తున్న సాయిశంతన్‌కుమార్‌ను గత ఫిబ్రవరి 20న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అప్పటి నుంచి మండలంలో బూర్గంపాడు ఏఓ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. మండలంలో యూరియా కొరత, ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు ఇన్‌చార్జ్ అధికారి పూర్తి స్థాయిలో సేవలు అందించలేక పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఏఓ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆదివాసులకు ఉచిత విద్య

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని ఆదివాసీ విద్యార్థులకు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా ఉచిత విద్య అందిస్తున్నట్లు అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు గుంటి రవీందర్, దయాకర్‌లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లును ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో డీడీ మణెమ్మ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య మీ ఇంటి దగ్గరికే అనే నినాదంతో విశ్వవిద్యాలయం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, లక్ష్మయ్య, జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ, ఇర్పా ప్రకాష్, పూణెం వరప్రసాద్, దుర్గారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీడీ మణెమ్మ, జేఏసీ నాయకులు

విద్యార్థినులకు అభినందన

ములకలపల్లి: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సత్తాచాటిన జూనియర్ కళాశాల విద్యార్థినిలను ప్రిన్సిపాల్ కల్పన అభినందించారు. ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక విద్యార్థినులు పడియార్ శృతి, తెల్లం నాగజ్యోతిలు సంయుక్తంగా ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు.

డీఎంఅండ్‌హెచ్ఓ జయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. ఈసందర్భంగా శనివారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు ప్రిన్సిపాల్ కల్పన దుశ్శాలువతో సత్కరించారు. ప్రశంసాపత్రం అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అతహర్ అలీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కల్పన, తదితరులు

ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం



సిద్ధార్థ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీవిద్య కళాశాల యాజమాన్యం

పినపాక: తమ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి శనివారం స్థానిక శ్రీవిద్య జూనియర్ కళాశాల యాజమాన్యం ఆర్థిక సాయం అందించారు. సాంబయ్యగూడెం గ్రామానికి చెందిన రాచకొండ సిద్ధార్థ తండ్రి సాంబయ్య ఇటీవల మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థికి యాజమాన్యం నిరోషారెడ్డి రూ.20 వేల నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ వితరణ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది బాలకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



చర్లలో పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

చర్ల: మండలంలోని మామిడిగూడెంకు చెందిన గిరిజనులపై అటవీశాఖాధికారులు పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ ఏటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్‌కు సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. చర్లకు వచ్చిన పీఓను పార్టీ డివిజన్ కార్యదర్శి ముసల సతీష్ నేతృత్వంలో కలిసిన మామిడిగూడెంకు చెందిన గిరిజనులు.. అటవీశాఖాధికారులు పెట్టిన అక్రమ కేసుల విషయాన్ని వివరించారు. సానుకూలంగా స్పందించిన పీఓ.. అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీనిచ్చారు. మామిడిగూడెంకు చెందిన గిరిజనులు తెల్లం రామకృష్ణ, తెల్లం పెంటమ్మ, కొమరం సమ్మయ్య, చల్లం శ్రీను, శ్యామల అరుణ, తెల్లం వెంకటరమణ, కొమరం రామక్క పాల్గొన్నారు.

సురవరం చిరస్మరణీయుడు



ములకలపల్లిలో సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ములకలపల్లి: సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి చిరస్మరణీయుడని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ అన్నారు. సురవరం అకాల మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్, జిల్లా సమితి సభ్యుడు నరాటి రమేష్, అనుమల సాయి, నకిరకంటి పుల్లారావు, మిర్యాల వెంకన్న, వీరూనాయక్, ఇమానియేల్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: సురవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్‌డి.సలీం అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గన్నిన రామకృష్ణ, చీపుర్ల సత్యవతి, ఎస్‌కె.రిజ్వానా, ఎస్‌డి.రజ్వి, సూర్య కుమారి, రసూల్‌బీ, చిన్నారావు, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

గుండాల: సురవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఐ గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్ అన్నారు. సురవరం మృతికి సంతాపంగా మండల కేంద్రంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు బచ్చల రామయ్య, గద్దం శ్రీనివాస్, గంగాధరి రాజయ్య, రమేష్, చందు, రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దోమలమందు పిచికారీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగులగండిలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం రెండో విడత దోమలమందు పిచికారీ చేశారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రజలకు పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్ రావు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రాంప్రసాద్, ఏవీ లక్ష్మి, కృష్ణ, శారద, నీలా పాల్గొన్నారు.

ఫ్రెషర్స్‌డే వేడుకలు



వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెలుగోటి శేషుబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలన్నారు. విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పి.హరిత, నల్లపు కొండలరావు, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అశ్వాపురం: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీఓ ఫరూఖ్ అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామం వద్ద శనివారం ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాల ట్యాక్స్ పరిశీలించి వాహనదారులు సమయానికి ట్యాక్స్‌లు చెల్లించాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ధ్రువపత్రాలు కలిగి ఉంటూ.. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

స్థానికుల ఎన్నికపై హర్షం

మణుగూరుటౌన్/చర్ల: సీపీఐ తెలంగాణ మహాసభలు ఇటీవల జరగగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి కమిటీ సభ్యులుగా మణుగూరు నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారికి స్థానం దక్కింది. చర్ల మండలానికి చెందిన కల్లూరి వెంకటేశ్వరావు సైతం రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎంపికయ్యారు. కాగా, వీరిని మండలాల సీపీఐ నాయకులు అభినందించారు. వెంకటేశ్వర్లును మండల కార్యదర్శి పోతయ్య, నాయకులు తాతాజీ, ముత్యాలరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, రాజారావు, వామనరావు, శ్రీనివాసరావు, రామారావు, సత్యనారాయణ, తిరుపతి అభినందించారు.

జీఓ 2ను సవరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి జీఓ నంబర్ 2ను సవరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు మాట్లాడుతూ.. ప్రస్తుత ఉపాధ్యాయ పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ రూల్ 22 ప్రకారంగా షెడ్యూల్ ట్రైబల్ ఎస్టీ ఉపాధ్యాయులకు 10 శాతం, ఎస్సీ ఉపాధ్యాయులకు 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటీఏ రాష్ట్ర నాయకులు సోయం హనుమంతరావు, పూనెం రమేష్, సోడి రాంబాబు, తుర్రం నరసింహారావు, పూసం హిందు లత, వర్ష సీతయ్య, గొర్రె రామకష్ణ, అపక బాల రాజు, ఇర్పా నరసింహమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో పనిచేస్తున్న కార్మికుడు విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం ఉదయం మెయిన్ చెక్‌పోస్టు సమీపంలో చోటు చేసుకుంది. తోటి కార్మికుల కథనం ప్రకారం.. హలావత్ భాస్కర్ ఉదయం షిఫ్ట్‌కి విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో సాంకేతిక లోపంతో నిలిచిపోయిన టిప్పర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో హెల్మెట్ తునాతునకలై తలకు గాయమైంది. ఏరియా ఆస్పత్రికి తరలించి.. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

భద్రాచలంటౌన్: యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రావులపల్లి బ్లడ్ డోనర్స్ క్లబ్ ముఖ్య సలహాదారుడు అకోజు సునీల్ కుమార్ సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం రావులపల్లి బ్లడ్ డోనర్స్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో రక్తహీనతతో బాధపడుతున్న రోగులకు చేయూతనివ్వడం కోసం రావులపల్లి బ్లడ్ డోనర్స్ క్లబ్ స్థాపించామన్నారు. క్లబ్ సభ్యులు నానిపల్లి ప్రమోద్, చిట్టిమల్లు అనిల్ కుమార్, ఇమంది నాగేశ్వరరావు, బద్ది బాబీ, నోముల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.